




దిన పత్రిక


# తొలి సమయం

వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 01 సంచిక : 289 మంగళవారం 15-10-2024 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..


# దౌత్య యుద్ధం!

## కెనడాపై భారత్ తీవ్ర ఆగ్రహం.. అక్కడి దౌత్యవేత్తల ఉపసంహారణ



**న్యూఢిల్లీ, అక్టోబరు 14:** భారత వేర్పాటువాద శక్తులకు ఊతమిస్తూ, ఖలిస్థానీలకు అండగా నిలుస్తున్న కెనడా సర్కారు మరోసారి కయ్యానికి కాలు దువ్వింది. 2023లో జరిగిన ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీపసింగ్ నిజ్జర్ హత్య కేసులో భారత హైకమిషనర్ సహా పలువురు దౌత్యవేత్తలను అనుమానితులుగా (పర్సన్స్ ఆఫ్ ఇంట్రస్ట్) పేర్కొంది. వీరిని విచారించాల్సి ఉందంటూ భారత విదేశాంగ శాఖకు సమాచారం పంపింది. దీనిపై భారత్ తీవ్ర స్థాయిలో స్పందించింది. భారత దౌత్యవేత్తలపై చేసిన కల్పిత ఆరోపణలకు తగిన విధంగా జవాబు చెప్పే హక్కు తమకు ఉందని స్పష్టం చేసింది. సోమవారం కెనడా నుంచి భారత హైకమిషనర్‌తో సహా ఆరుగురు దౌత్య సిబ్బందిని ఉపసంహరించుకుంది. భారత్‌లో ఉన్న ఆరుగురు కెనడా దౌత్య సిబ్బందిని భారత్ నుంచి 'బహిష్కరించింది'. "కెనడా ప్రభుత్వంపై మాకు విశ్వాసం లేదు. మా హైకమిషనర్, దౌత్య, ఉన్నతాధికారుల భద్రత విషయంలో భరోసా లేకుండా పోయింది. తీవ్రవాదం, హింసాత్మక వాతావరణంలో ట్రూడో ప్రభుత్వ చర్యలు వారి భద్రతను ప్రమాదంలోకి నెట్టాయి. అందుకే భారత హైకమిషనర్, దౌత్య, ఉన్నతాధికారులను ఉపసంహరించుకోవాలని నిర్ణయించాం" అని భారత్‌లో కెనడా హైకమిషనర్ (ఇన్‌చార్జి) స్టీవార్ట్ వీలర్‌కు విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. వీలర్‌తోపాటు ఆరుగురు కెనడా దౌత్య సిబ్బందిని భారత్ నుంచి బహిష్కరించింది. వీరు ఈనెల 19వ తేదీలోపు భారత్‌ను వీడి వెళ్లిపోవాలని స్పష్టం చేసింది. 1988 ఐఎఫ్ఎస్ బ్యాచ్‌కు చెందిన సంజయ్ కుమార్ వర్మ.. 2022 సెప్టెంబరు నుంచి కెనడాలో భారత హైకమిషనర్‌గా పనిచేస్తున్నారు. ఆయనపై కెనడా ఆరోపణలు చేయడాన్ని భారత్ ఖండించింది. ఆయన ఎలాంటివారో తమకు తెలుసునని, 36 సంవత్సరాలుగా ఆయన వివిధ దేశాల్లో భారత దౌత్యవేత్తగా పనిచేస్తున్నారని తెలిపింది. కెనడా ప్రధాని ట్రూడో కేవలం రాజకీయ లబ్ధి కోసం భారత వ్యతిరేక శక్తులతో చేతులు కలిపి, వేర్పాటువాదులకు కొమ్ము కాస్తున్నారని భారత విదేశాంగ శాఖ పేర్కొంది. "భారత్‌పై ట్రూడో శత్రుత్వం ఇప్పటిదికాదు. దీనికి ఎన్నో ఆధారాలు ఉన్నాయి" అని భారత విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. "ట్రూడో మంత్రివర్గంలో కొందరికి తీవ్రవాదులు, భారతదేశ విభజన కోరుకునే వారితో నేరుగా సంబంధాలున్నాయి. 2018 నుంచి ట్రూడో భారత్‌తో ఘర్షణాత్మక వైఖరినే ప్రదర్శిస్తున్నారు. 2020 డిసెంబరులో భారత అంతర్గత రాజకీయాల్లో జోక్యం చేసుకోవడం ద్వారా ఆయన నిజస్వరూపం బయటపడింది" అని విదేశాంగ శాఖ నిప్పులు చెరిగింది. భారత వ్యవహారాల్లో విదేశీ జోక్యంపై ట్రూడోను విచారణ కమిషన్ నిలదీయనున్న నేపథ్యంలోనే ఈ ఎజెండాను అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. మరోవైపు, క్షీణిస్తున్న భారత్–కెనడా దౌత్య సంబంధాల విషయంలో ప్రధాని మోదీ ప్రతిపక్షాల సలహాలనూ పరిగణనలోకి తీసుకోవాలని కాంగ్రెస్ కోరింది.

# ప్రధాని మోడీతో అతిషి భేటీ

### సిఎంగా బాధ్యతలు చేపట్టాక కలిసినట్లు వెల్లడి



**న్యూఢిల్లీ,అక్టోబర్14:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆప్ సీనియర్ నేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషిసోమవారంనాడు కలుసుకున్నారు. ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ఆమె ప్రధానిని కలుసుకున్నారు. సమావేశం ఎజెండా ఏమిటనేది మాత్రం వెంటనే తెలియలేదు. ఢిల్లీ ముఖ్యమంత్రి నివాసం కేటాయింపుపై లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాకు, ప్రభుత్వానికి మధ్య మాటల యుద్ధం నడుస్తున్న తరుణంలో ప్రధానితో అతిషి సమావేశం కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రధానిని ఢిల్లీ సీఎం కలుసుకున్నట్టు పీఎంఓ ఒక ట్వీట్‌లో ధ్రువీకరించింది. అయితే ఇంతకు మించిన సమాచారం ఏదీ తెలియజేయలేదు. ప్రధానితో సమావేశమైనట్టు 'ఎక్స్' వేదకగా అతిషి తెలిపారు. ఢిల్లీ అభివృద్ధికి, సంక్షేమానికి కేంద్రం సహకరిస్తుందని ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు. ఎక్సైజ్ పాలసీ కుంబకోణంలో ఐదు నెలల జైలు అనంతరం బెయిలుపై విడుదలైన అరవింద్ కేజీవ్రాల్ తన సీఎం పదవికి రాజీనామా చేయడంతో అతిషి ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టారు.

# పెట్టుబడులు పెట్టే కంపెనీలకు ప్రోత్సాహం

### ఫాక్స్‌కాన్ కంపెనీ పురోగతిని పరిశీలించిన రేవంత్



**తొలి సమయం హైదరాబాద్,**
తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చే కంపెనీలకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో సంస్థలకు ఎలాంటి అనుమానాలు అక్కరలేవన్నారు. పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ శివారు కొంగరకలాన్‌లోని ఫాక్స్ కాన్ కంపెనీని సోమవారం సాయంత్రం సందర్శించారు. తెలంగాణలో మరిన్ని విభాగాల్లో పెట్టబడులకు ఫాక్స్ కాన్ ప్రతినిధులను సీఎం రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. కొంగరకలాన్ లో ఫాక్స్‌కాన్ ప్రతినిధులతో సమావేశమై కంపెనీ పురోగతి, ఇతర అంశాలను సీఎం రేవంత్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఫాక్స్‌కాన్ చైర్మన్ యాంగ్ లియూతో సీఎం రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. రాష్ట్రంలో ఫాక్స్ కాన్ కంపెనీకి కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనలో అన్ని విధాలుగా సహకరిస్తామని స్పష్టం చేశారు.

# క్యాట్‌ను ఆశ్రయించిన ఐఏఎస్‌లు

### తెలంగాణలోనే కొనసాగించాలని రిక్వెస్ట్

**తొలి సమయం హైదరాబాద్,** తెలంగాణ కేడర్‌కు చెందిన పలువురు ఐఏఎస్ అధికారులను డీవోపీటీ ఏపీకి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తక్షణమే ఏపీలో రిపోర్ట్ చేయాలని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నలుగురు ఐఏఎస్ అధికారులు సోమవారం కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు వాకాటి కరుణ, వాణి ప్రసాద్, ఆమ్రపాలి, సృజన వేర్వురుగా క్యాట్‌లో పిటిషన్లు దాఖలు చేశారు. డీవోపీటీ ఉత్తర్వులను రద్దు చేయాలని ఐఏఎస్ అధికారులు కోరారు. తెలంగాణలోనే కొనసాగేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అధికారుల పిటిషన్లపై క్యాట్ మంగళవారం విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. ఏపీ విభజన నేపథ్యంలో తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు కేంద్రం ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను కేంద్రం సర్దుబాటు చేసింది. ఈ సమయంలో ఐఏఎస్ అధికారులను ఏపీ, తెలంగాణ కేడర్‌లకు కేటాయించింది. అయితే, ఇందులో కొందరు అధికారులు తమను ఏపీ కేడర్‌కు కేటాయించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ కేడర్‌గా గుర్తించాలని కోరుతూ పలు కారణాలను చూపించారు. అయితే, ఈ విషయంలో సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ క్యాట్‌ను ఆశ్రయించగా.. అధికారుల అభ్యర్థనను క్యాట్ పరిగణలోకి తీసుకున్నది. అయితే, ఈ తీర్పును డీఓపీటీ తెలంగాణ హైకోర్టు సవాల్ చేసింది. 2023 మార్చిలో పిటిషన్‌పై విచారించింది. అధికారుల అభ్యర్థనను పరిశీలించాలని కేంద్రాన్ని ఆదేశించింది. దీంతో దీపక్ ఖండేకర్ ఏకసభ్య కమిషన్‌ను కేంద్రం ఈ ఏడాది మార్చి 21న ఏర్పాటు చేసింది. కమిటీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల అభ్యర్థనలను పరిశీలించింది. వ్యక్తిగతంగానూ విచారించి.. అభ్యర్థలను తిరస్కరించింది. ఈ క్రమంలో డీఓపీటీ ఏపీ కేడర్‌కు కేటాయించిన ఆలిండియా సర్వీస్ అధికారులను ఏపీ కేడర్‌కు వెళ్లాల్సిందిగా ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 16లోగా ఏపీలో రిపోర్ట్ చేయాలని డీఓపీటీ స్పష్టం చేసింది. అయితే, డీఓపీటీ ఆదేశాలను సవాల్ చేస్తూ నలుగురు అధికారులు క్యాట్‌ని ఆశ్రయించారు.

# హైడ్రా ఆగితే.. హైదరాబాద్ మరో వయనాడ్

### - కాంగ్రెస్ ప్రభుత్వం మీద బిజెపి, బిఆర్ఎస్ దుష్ప్రచారం

### - సాధ్యమైనంత తొందరగా లోకల్ బాడి ఎన్నికల నిర్వహణ - టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు



**తొలి సమయం,నిజామాబాద్,అక్టోబర్14**
ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, నాలాల పరిరక్షణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా ఆగిపోతే.. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మరో వయనాడ్ అవుతోందని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. హైడ్రా అంశంలో వెనక్కి తగ్గేది లేదని.. హైడ్రా, మూసీ ప్రక్షాళన నిరంతరంగా కొనసాగుతోందని తేల్చి చెప్పారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన మీద కేటీఆర్, హరీష్ రావు, కిషన్ రెడ్డిలవి చిల్లర మాటలని ఫైర్ అయ్యారు. నిజామాద్ జిల్లాలో పర్యటించిన మహేష్ కుమార్ గౌడ్.. ఎమ్మెల్సీ ఎన్నికలపై కాంగ్రెస్ కార్యకర్తలతో చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయమని ధీమా వ్యక్తం చేశారు. గత పదేళ్ళలో యువతకు ఉద్యోగాలు ఇవ్వని బీఆరెస్‌కు గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పోటీ చేసే అర్హత లేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పెద్ద ఎత్తున ఉద్యోగలిచ్చామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మీద దుష్ప్రచారం చేయటానికి బీఆర్ఎస్, బీజేపీ ఒకటయ్యాయని.. సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. కాళేశ్వరం సహా బీఆర్ఎస్ పాలనలో జరిగిన అవినీతిపై ఉక్కుపాదం మోపతామని హెచ్చరించారు. కాంగ్రెస్ పాలనను వివరిస్తూనే స్థానిక సంస్థలు ఎన్నికలకు వెళతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే స్థాయి బీఆర్ఎస్, బీజేపీ నేతలకు లేదని అన్నారు. నిలిచిపోయిన ఎల్ఆర్ఎస్, మాస్టర్ ప్లాన్ అంశాలపై అందరితో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. లోకల్ బాడి ఎన్నికలను సాధ్యమైనంత తొందరగా నిర్వహించాలనే ఆలోచనలో ఉన్నామని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. రాష్ట్రంలో కుల గణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. రుణమాఫీ, రైతు భరోసా, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చాం, స్థానిక సంస్థల్లో మెజార్టీ సీట్లు తామే గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 50 వేల వరకు ఉద్యోగాలు ఇచ్చామన్నారు. కేసీఆర్ ప్రభుత్వం 10 ఏళ్లలో 30 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. రుణమాఫీ విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ ప్రజలను అయోమయానికి గురిచేస్తు న్నాయన్నారు. పదేళ్లలో బీర్ఎస్ ఇచ్చిన రుణమాఫీ ఎంత, కాంగ్రెస్ 9 నెలల్లో ఇచ్చిన రుణ మాఫీ ఎంతో రైతులు గుర్తించాలని సూచించారు. సోషల్ మీడియాని సోషల్ సెన్స్ లేకుండా వాడుతున్నారని పీసీసీ చీఫ్ మండిపడ్డారు. పచ్చి అబద్దాలు ప్రచారం చేస్తున్నారని ఇది తాత్కాలిక ఆనందం ఇచ్చినా దీర్ఘకాలికంగా బి అర్ ఎస్ కు నష్టం చేకూరుస్తుందని హెచ్చరించారు. బీజేపీ, బీఆర్ఎస్ లు ప్రజలను మభ్యపెడుతున్నా యన్నారు. వీలైనంత త్వరలో రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ జరుగుతుందని తెలిపారు. మంత్రి కొండా సురేఖ ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి వివాదంపై పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. పరకాలలో కార్యకర్తల అత్యుత్సాహం వల్లే ఇద్దరి మధ్య వివాదం చెలరేగిందన్నారు. మంత్రి , ఎమ్మెల్యే ఇరువురి తో మాట్లాడినట్లు తెలిపారు. ఈ అంశంపై మాట్లాడాలని ఇన్‌ఛార్జి మంత్రికి చెప్పామన్నారు. మంత్రి సురేఖ, ఎమ్మెల్యే రేవూరి వివాదం పార్టీ అంతర్గత సమస్య త్వరలో సమసిపోతుందని స్పష్టం చేశారు. మరోవైపు ఎమ్మెల్యే పోచారం, మాజీ ఎమ్మెల్యే రవీందర్ రెడ్డి పై మధ్య సయోధ్య కుదిర్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. డీసీసీ అధ్యక్షునికి బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలకు నష్టం జరగకుండా సామరస్యంగా సమస్య పరిష్కరిస్తామన్నారు. ఆదివారం కొండా వర్గం రేవూరి వర్గం మధ్య ఫ్లెక్సీల వివాదం చెలరేగింది. దసరా బతుకమ్మ వేడుకల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఎమ్మెల్యే రేవూరి పేరు లేకపోవడంతో వివాదం మొదలైంది. ఎమ్మెల్యే పేరు పెట్టాలంటూ కొండ వర్గానికి రేవూరి అనుచరులు సూచించారు. రేవూరి ఫోటో లేకుండా ఫ్లెక్సీలు పెట్టడంతో ఫ్లెక్సీలను చించేశారు. ఫ్లెక్సీలు చించి వేసారంటూ రేవూరి అనుచరులపై కొండ వర్గం దాడికి పాల్పడ్డారు. దీంతో గాయాల పాలైన రేవూరి అనుచరులు కొండ వర్గంపై ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని కొండ అనుచరులను అరెస్ట్ చేశారు. ఆధారాలు లేకుండానే తమ కార్యకర్తలను అరెస్ట్ చేశారంటూ కొండ అనుచరులు పేర్కొన్నారు.. గీసుకొండా పోలీస్ స్టేషన్ పరిధిలో 16వ డివిజన్ నర్సంపేట రహదారిపై కొండా వర్గం ధర్నాకు దిగింది. పోలీసులు అదుపులోకి తీసుకున్న తమ వర్గానికి చెందిన కార్యకర్తలను విడుదల చేయాలంటూ ఆందోళన చేపట్టారు. ధర్నా చేస్తున్న కార్యకర్తలపై ప్రయాణికులు అసహనం వ్యక్తం చేశారు. సమస్య వివాదాస్పదం కాకుండా రంగంలోకి దిగిన పోలీసులు ఇరు వర్గాలకు నచ్చచెప్పి ట్రాఫిక్ ని క్లియర్ చేశారు. ఈ ధర్నాతో మరోసారి కొండ, రేవూరి ఆధిపత్య పోరు మరోసారి బట్టబయలైంది.

# బిఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ పాలన

### తక్కువ కాలంలోనే అప్రతిష్ట మూటకట్టుకున్న రేవంత్

### మూసీ పేరుతో పేదల ఇళ్లు కూలగొడుతున్నారు

### నవంబర్ 1నుంచి బిజెపి ఉద్యమబాట పడుతుంది

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



**తొలి సమయంవరంగల్,అక్టోబర్14:**
నవంబర్ 1 నుంచి బీజేపీ ఉద్యమ బాట పట్టనుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. తెలంగాణ సాధించుకున్న తర్వాత 10 సంవత్సరాల పాలనలో గత ప్రభుత్వాలు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించాయని మండిపడ్డారు. కేసీఆర్ కుటుంబ పాలనలో రాష్ట్రం వెనుకబడి ందన్నారు. రాష్ట్రంలో ఎలాంటి సంక్షేమ సరిగా పథకాలు అమలు కాలేదని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ తరహాలోనే వ్యవహరిస్తుందని కేంద్ర మంత్రి విమర్శించారు. ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 2014 లో బీజేపీ సభ్యత్వ సేకరణ తర్వాత 2024 లో చేస్తున్నామన్నారు. సభ్యత్వ నమోదు సమీక్ష సమావేశానికి హాజరైన మంత్రి మాట్లాడారు. నూతనంగా గ్రామీణ మండల జిల్లా వ్యాప్తంగా నూతన కమిటీ సేకరణ ఏర్పాటు చేస్తామన్నారు. పేదలకు ఇళు కట్టకుండా పేదల ఇళ్లను కూల్చేన్న ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీదన్నారు. అతి తక్కువ సమయంలో ప్రజల వ్యతిరేకతను కాంగ్రెస్ ప్రభుత్వం కూడగట్టుకుందని తెలిపారు. మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని కెసిఆర్ అప్పుల పాలు చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం మూసి సుందరీకరణ పేరుతో రూ.లక్ష 80 వేల కోట్ల బడ్జెట్ కేటాయించి ఇంతవరకు డీపీఆర్ తయారు చేయలేదన్నారు. కాంగ్రెస్‌పై వ్యతిరేకతతోనే హర్యానా రాష్ట్రంలో బీజేపీకి ప్రజలు పట్టం కట్టారన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ సహకరించకుండా ముందుకు పోనున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జమ్మూ కాశ్మీర్ లో బీజేపీకి గణనీయంగా ఓట్ల శాతం పెరిగిందని పార్టీని కొనియాడారు. ముస్లింలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో బీజేపీకి అధిక ఓట్లు రావడం విశేషమన్నారు. దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక పర్యాటకం పెరుగుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు.

# ప్రొఫెసర్ సాయిబాబా మరణం భారత విప్లవోద్యమాలకు తీరని లోటు

**- భగత్ సింగ్ స్టడీ సర్కిల్ అధ్యక్షులు కళ్లెం వీరారెడ్డి**

**- ప్రొఫెసర్ సాయిబాబా కు విప్లవ జోహార్లు: - సిపిఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్**




**తొలి సమయం మహబూబాబాద్ అక్టోబర్ 14 :** పట్టణంలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద భగత్ సింగ్ స్టడీ సర్కిల్ మరియు ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మరణించిన మానవ హక్కుల కార్యకర్త, మేధావి, ప్రొఫెసర్ కామ్రేడ్ జి ఎన్ సాయి బాబాకు నివాళులు అర్పించారు.పలువురు ప్రజాస్వామిక వాదులు పాల్గొన్నరు. ఈ కార్యక్రమంలో భగత్ సింగ్ స్టడీ సర్కిల్ అధ్యక్షులు శ్రీ కళ్లెం వీరారెడ్డి మాట్లాడుతూ– సమాజంలో అసమానతలు, దోపిడీ పీడనలకులేని సమాజం కోసం పోరాడిన మానవతావాది ప్రొఫెసర్ జీఎన్ జి సాయిబాబా అన్నారు ఆయన తెలంగాణ స్వాప్నికుడు అన్నారు , పౌర హక్కుల , ఆదివాసుల హక్కుల దశాబ్ద కాలం పాటు నిర్బంధించినా కాని నమ్మిన సిద్ధాంతం చివరి వరకు నిటారుగా నిలబడి ప్రజల కోసం ప్రాణాలు ఇచ్చాడు అన్నారు ,ప్రొఫెసర్ సాయిబాబా మరణం భారతదేశ విప్లవద్యమాలకు తీరనిలోటు అన్నారు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని వ్యక్తం చేశారు.డిటియఫ్ జిల్లా నాయకులు డి.మాధవ్ మాట్లాడుతూ – సాయిబాబా జీవిత కాలం అణగారిన ప్రజల హక్కుల గొంతుకగా పౌర హక్కుల నాయకుడిగా ప్రజా సమస్యలను తన కలం ద్వారా నవతరం విద్యార్థి లోకానికి ఎన్నో జీవిత పాఠాలు నేర్పిన గొప్ప మహోన్నత మానవత్వం కలిగిన వ్యక్తి అని అన్నారు. సాయిబాబాను ఏ నేరం చేయకుండానే కేంద్రంలో ఉన్న మనువాద ఫాసిస్టు భావజాలం కలిగిన పాలకులు సుమారుగా గత పదేళ్లుగా నాగపూర్ జైల్లో అండా సెల్ లో నిర్బంధించారని చేయని నేరానికి పదేళ్ల కాలం శిక్ష అనుభవించిన భారత విప్లవోద్యమ నాయకుడిగా ప్రభుత్వాల అసమర్థతనానికి నిదర్శనంగా సాయిబాబా మొక్కవోని ధైర్యంతో జైలు గోడలను బద్దలు కొట్టుకొని ముంబై హై కోర్టు ఇచ్చిన తీర్పుతో బయటకు వచ్చి ఆరు నెలలు గడవకముందే అనారోగ్య సమస్యతో తుది శ్వాస విరవడం భారత విప్లవోద్యమాలకు తీరని లోటు అన్నారు .సిపిఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ 90 శాతం అంగవైకల్యం ఉన్న సాయిబాబా పై ఉపా చట్టాన్ని ప్రయోగించి 2014 నుంచి దీర్ఘకాలం జైలులో ఉంచి నిర్బంధించడం ఆయన మరణానికి కారణమైందని, ఈ అన్యాయాన్ని ఖండిస్తున్నామని భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా సమాజం చైతన్యంతో స్పందించాలని, మరణించిన ప్రజల మధ్య జీవించే సాయిబాబా మనందరికీ ఆదర్శమని, ఆయన మార్గం అనుసరించడమే మనం అర్పించే నిజమైన నివాళి అని ,ప్రజా సంఘాల ఐక్యవేదిక మరియు సిపిఎం జిల్లా కమిటీ పక్షాన ఆయనకు విప్లవ జోహార్లు అర్పిస్తున్నామని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో భగత్ సింగ్ స్టడీ సర్కిల్ బాధ్యులు సోమా గోవర్ధన్ కొమిరె ఉప్పలయ్య, డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు ఉపేందర్ రెడ్డి, ప్రజా సంఘాల నాయకులు గునిగంటి రాజన్న గుంజె హనుమంతు, దుడ్డెల రామ్మూర్తి తదితరులు పాల్గొని ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళులర్పించారు

# అమ్మ ఆదర్శ పాఠశాలలు, మన ఊరు - మన బడి, అంగన్వాడీ కేంద్రాల పెండింగ్ పనులు పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**






**తొలి సమయం మహబూబాబాద్ అక్టోబర్ 14 :** జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలలు, మన ఊరు – మన బడి, పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు, జిల్లా కలెక్టర్, సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, సంబంధిత అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే గుర్తించబడి కొనసాగుతున్న పాఠశాలల అభివృద్ధి పనులు, (438) అమ్మ ఆదర్శ పాఠశాలల, త్రాగు నీరు, సరఫరా, టాయిలెట్స్ , విద్యుత్ సరఫరా, మైనర్ రిపేర్స్ , బాలికలకు ప్రత్యేక టాయిలెట్స్, పనులు, (315) మన ఊరు – మన బడి, క్రింద కిచెన్ షెడ్, కాంపౌండ్ వాల్స్ నిర్మాణం, పెయింటింగ్స్, గ్రీన్ చాక్ బోర్డు, టేబుల్స్, అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధి తదితర పనులలో పెండింగ్ ఉంటే వెంటనే పూర్తి చేయాలని,

సంబంధిత పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, ట్రైబల్ వెల్ఫేర్, టీజీ డబ్ల్యూఐసి, శాఖలను కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పాఠశాల అభివృద్ధి, అంగన్వాడి కేంద్రాల అభివృద్ధి, పనులను పూర్తి చేసి విద్యార్థిని, విద్యార్థులకు హ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధనలు అందించడం కోసం కృషి చేస్తుందని అన్నారు. ఈ సమావేశంలో (ఇన్చార్జి) డిఈఓ శ్రీరాములు, ఈఈ పంచాయతీరాజ్, విద్యాసాగర్, ఈఈ ఆర్ అండ్ బి, భీమ్లా నాయక్, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్, వీరభద్రం, ఈఈ టీజీ డబ్ల్యూఐసి, నరేందర్, సిపిఓ సుబ్బారావు, వెల్ఫేర్ ఆఫీసర్ వరలక్ష్మి, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్**





**తొలి సమయం,మహబూబాబాద్ అక్టోబర్ 14:** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిశిలించాలన్నారు, జిల్లా కలెక్టర్ సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు స్థానిక సంస్థలు, రెవెన్యూ, లెనిన్ వత్సల్ టోప్పో, డేవిడ్ లతో కలిసి కలెక్టర్ ప్రజా వాణి కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. ఏదైనా శాఖ పరమైన సమస్యలు ఉంటే వారికి కావలసిన సమాచారం గైడ్ చేయాలని సూచించారు.ఈ సోమవారం నాడు రెవెన్యూ శాఖకు సంబంధించి 22, పంచాయతీరాజ్3, ఎస్టీ వెల్ఫేర్ 3, మున్సిపల్2, సివిల్ సప్లై 2, వైద్య ఆరోగ్యశాఖ 2, బ్యాంకింగ్ 2, ఇలా తదితర విభాగాలకు చెందిన మొత్తం (46) దరఖాస్తులు ఈరోజు వచ్చాయని, పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి సుబ్బారావు,డిసిఓ వెంకటేశ్వర్లు, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ నరేష్, డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన్ రాజు, జడ్పీసీఈవో నర్మద, బీసీ వెల్ఫేర్ అధికారి నర్సింహస్వామి, ఏడి ల్యాండ్ సర్వే నరసింహమూర్తి, డిహెచ్ఓ మరియన్న,డిఎఓ విజయ నిర్మల, ఎల్డిఎం ఎస్ మూర్తి, వెల్ఫేర్ అధికారిని వరలక్ష్మి, డిఎంసిఎస్ క్రిష్ణవేణి, డిఎస్ఓ ప్రేమ్ కుమార్,అన్ని విభాగాల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, సంబధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## కొండా సురేఖ వ్యాఖ్యలపై కెటిఆర్ పరువు నష్టం

**పరువుకు భంగం కలిగించినందుకు**

**కఠిన చర్యలు తీసుకోవాలి**

**18వ తేదీకి వాయిదా వేసిన నాంపల్లి కోర్టు**

**తొలి సమయం,హైదరాబాద్,అక్టోబర్14:** రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మీద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన పరువు నష్టం దావాపై నాంపల్లి స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టులో సోమవారం విచారణ జరిగింది. తదుపరి విచారణను కోర్టు ఈ నెల 18వ తేదీకి వాయిదా వేసింది. ఈ నెల 18న కేటీఆర్తో పాటు నలుగురు సాక్షులు బాల్క సుమన్, సత్యవతి రాథోడ్, తుల ఉమ, దాసోజు శ్రవణ్ స్టేట్మెంట్లను కోర్టు రికార్డు చేయనుంది. తన పేరు ప్రతిష్టలకు భంగం కలిగించేలా మంత్రి కొండా సురేఖ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో కేటీఆర్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం రాజకీయ లబ్ది కోసం నిరాధారమైన ఆరోపణలు చేశారని అందులో పేర్కొన్నారు. బీఎన్ఎస్ సెక్షన్ 356 కింద క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోర్టును కోరారు. కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై పరువు నష్టం దావా వేస్తానని కేటీఆర్ గతంలోనే లీగల్ నోటీసులు ఇచ్చారు. వారం రోజుల్లోగా బహిరంగ క్షమాపణ చెప్పాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఇచ్చిన గడువు ముగిసిన నేపథ్యంలో మంత్రిపై పరువు నష్టం దావా వేసినట్లు తెలిపారు. తాను ఐదోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని, తొమ్మిదేండ్లకుపైగా రాష్ట్ర మంత్రిగా పనిచేశానని పిటిషన్లో కేటీఆర్ పేర్కొన్నారు. ప్రస్తుతం సిరిసిల్ల నియోజక వర్గ ఎమ్మెల్యేగా, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్గా కొనసాగు తున్నానని తెలిపారు. రాష్ట్రానికి ప్రపంచ దేశాలనుంచి పెట్టుబడులు సాధించేందుకు రాష్ట్రం తరఫున విదేశాల్లో జరిగిన అనేక సమావేశాలకు హాజరయ్యానని తెలిపారు. రాష్ట్ర పురోగతికి అంకితభావంతో పనిచేసి పలు సంక్షేమ పథకాల అమలుకు కృషి చేసినట్టు చెప్పారు. ఈ క్రమంలో పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు సైతం అందుకున్నట్టు పిటిషన్లో పేర్కొన్నారు. అలాంటి తనపై మంత్రి సురేఖ నిరాధార ఆరోపణలు చేశారని, ఆమె వ్యాఖ్యలు తన పరువుకు భంగం కలిగించేవిగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలకు సంబంధించి మీడియాలో వచ్చిన వార్తలను, సోషల్ మీడియాలోని కథనాలను, పలు టీవీ ఛానల్లో వచ్చిన వార్తలను పెన్డ్రైవ్లో నిక్షిప్తంచేసి కోర్టుకు సమర్పించారు. పత్రికల్లో వచ్చిన క్లిపింగ్లను, ఫోటోలను పిటిషన్కు జోడించి దాఖలు చేశారు. కొండా సురేఖ గతంలో కూడా ఇలాంటి అడ్డగోలు వ్యాఖ్యలు చేసి, ఎన్నికల సంఘంతో చీవాట్లు తిన్న విషయాన్ని కూడా పిటిషన్లో ప్రస్తావించారు.

## విద్యుత్ ఆన్ మ్యాన్డ్ ఉద్యోగుల వేతనాలు పెంచడం హర్షణీయం

**ఆన్ మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల కిరణ్ గౌడ్**



**తొలి సమయం మహబూబాబాద్ అక్టోబర్ 14 :** టిజి ఎన్పిడిసిఎల్ కంపెనీలో విద్యుత్ ఆన్ మ్యాన్డ్ కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న ఆన్ మ్యాన్డ్ కార్మికుల వేతనాలు పెంచడం హర్షనీయమని తెలంగాణ విద్యుత్ ఆన్ మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ భూపాలపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల కిరణ్ గౌడ్ ఆశభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఆన్ మ్యాన్డ్ వర్కర్లకు కొంతమేర జీతాలు పెరగడం సంతోషమని గత బిఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్టు ఎంప్లాయిస్ ను రెగ్యులరైజ్ చేస్తామని కొంతమందిని మాత్రమే ఆర్టిజన్లుగా గుర్తించడం జరిగిందని ఆన్ మ్యాన్డ్ వర్కర్లను విస్మరించడం జరిగిందని ఆన్ మ్యాన్డ్ వర్కర్లు రెగ్యులర్ ఎంప్లాయిస్ తో సమానంగా పనిచేస్తున్నప్పటికి ఈపిఎఫ్, ఈఎస్ఐ లేదని సాకుతో ఆర్టిజన్లుగా గుర్తించలేకపోయారని రెగ్యులర్ అయ్యేంత వరకు ఇదే ఐకమత్యంతో పోరాడాలని ఆన్ మ్యాన్డ్ కార్మికుల సీల్డ్ వేతనాల పెంపుదలకు కృషి చేసిన ప్రభుత్వానికి, యాజమాన్యానికి ఎన్పిడిసిఎల్ సిఎండీ కర్నాటి వరుణ్ రెడ్డికి,ఐఎన్టియుసి 327 యూనియన్ సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్,సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఈశ్వర్ టిఆర్వికే ఎస్ అధ్యక్షులు జాన్సన్, 1104యూనియన్ పెద్దలు సాయిబాబలకు ఆన్ మ్యాన్డ్ కార్మికుల తరుపున కిరణ్ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యుత్ శాఖలో బదిలీలు

**-మొగుళ్ళపల్లి లైన్మెన్ రఘుకు ఘన సన్మానం**

**-బదిలీలు సహజం..చేసే వృత్తి ధర్మం గొప్పది**

**-మొగుళ్లపల్లి మాజీ సర్పంచ్ మోటే ధర్మన్న**



**తొలి సమయం మహబూబాబాద్ అక్టోబర్ 14 :** మొగుళ్లపల్లి మండలంలో వివిధ హోదాల్లో పని చేసే విద్యుత్ శాఖకు చెందిన అధికారులు బదిలీ అయ్యారు. మొగుళ్ళపల్లి మండల విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్ పైసా హరీష్ ములుగు మండలానికి బదిలీ కాగా, మొగుళ్ళపల్లి టౌన్ లైన్మెన్ రఘు టేకుమట్ల మండల కేంద్రానికి బదిలీ అయ్యారు. అలాగే మండలంలోని మొట్లపల్లి లైన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ గణపురం మండలానికి బదిలీ కాగా..మొట్లపల్లి లైన్మెన్ శ్రీనివాస్ చిట్యాల 33 కెవి ఎస్ ఎస్ కు బదిలీ అయ్యారు. కాగా ఆయన స్థానంలో మొట్లపల్లి లైన్మెన్ గా సత్యం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా మొగుళ్లపల్లి టౌన్ లైన్మెన్ రఘుకు మండల కేంద్రంలోని ప్రముఖులు శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం మాజీ సర్పంచ్ మోటే ధర్మన్న మాట్లాడారు. ఉద్యోగ జీవితంలో బదిలీలు అనేటివి సహజమని..చేసే వృత్తిలో నిబద్ధత, ధర్మం, ప్రజలకు సేవ చేసే గుణంతోనే పేరు ప్రఖ్యాతులు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ సంపెల్లి నరసింగరావు, కొడారి ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

## బలమైన నాయకత్వమే రాష్ట్రానికి దిశ

**చంద్రబాబు అనుభవంతో అభివృద్ధికి అడుగులు**

**చంద్రబాబు దిశా నిర్దేశంలో వడివడిగా పరుగులు**


**కలసికట్టుగా ప్రభుత్వాన్ని పరుగులు పెట్టిస్తున్నాం**

**'పల్లె పండగ' వారోత్సవాల్లో పవన్ కళ్యాణ్**

**విజయవాడ,అక్టోబర్14:** బలమైన నాయకత్వం వల్ల రాష్ట్రానికి మంచిరోజులు వచ్చాయని, చంద్రబాబు విజనరీ నేత అని డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ అన్నారు. అందుకే ధృడ సంకల్పంతో ముందుకెళ్తున్నామని అన్నారు. అనుకున్న విజయాన్ని సాధించాం. రాష్ట్ర శ్రేయస్సు సంకల్పం బలంగా ఉన్నప్పుడే అనుకున్నది సాధ్యమవుతుందని అన్నారు. ఏపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'పల్లె పండగ' వారోత్సవాలను డిప్యూటీ సీఎం పవన్కల్యాణ్ కృష్ణా జిల్లా కంకిపాడులో దీనికి శ్రీకారం చుట్టారు. ఈసందర్భంగా పవన్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. రూ.95.15 లక్షలతో రోడ్లు, మినీ గోకులాలు, పునాదిపాడులో రూ.52 లక్షలతో 2 అంతర్గత రహదారులు, రూ.54 లక్షలతో సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ నిర్మాణానికి శిలాఫలకాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడారు. మా ఆకాంక్ష అంతా ఒక్కటేనని, రాష్ట్రంలోని ప్రజలంతా బాగుండాలని అన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు రావాలి.. పల్లెల్లో వెలుగులు నిండాలి. ఇవన్నీ జరగాలంటే వైకాపా ప్రభుత్వం దిగిపోవాలని గట్టిగా కృషి చేశాం అని వివరించారు. ఒకేరోజు 13,326 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించాం. దేశంలో ఇలా జరగడం ఇదే మొదటిసారి. ఇప్పటికే పంచాయతీ తీర్మానాలు చేసిన పనులకు పరిపాలన, సాంకేతికపరమైన ఆమోదం ఇచ్చాం. రూ.4,500 కోట్ల నిధులు విడుదల చేస్తున్నాం. పంచాయతీల్లో పనులపై డిస్ప్లే బోర్డులు ఉండాలి. దాపరికం లేకుండా అన్ని వివరాలు అందులో కనిపించాలి. మేం ఎంత పారదర్శకంగా ఉన్నా.. వ్యవస్థలో వ్యక్తులు కూడా బలంగా ఉండాలని పవన్ అన్నారు. నాలుగోదఫా ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు తనకు స్ఫూర్తి. అని, ఆయన అపారమైన అనుభవం రాష్ట్రానికి బలం అని పవన్ అన్నారు. నాయకుడి కష్టం, అనుభవం రాష్ట్ర శ్రేయస్సుకు ఉపయోగించుకోకపోతే తప్పు చేసినవాళ్లం అవుతాం. అందుకే ఆరోజు కలిసి వెళ్లాలనే నిర్ణయం తీసుకున్నా. అప్పుడు తీసుకున్న నిర్ణయం సరైనదేనని అనిపిస్తోంది. తెదేపా, భాజపా, జనసేన బలంగా నిలబడటం వల్లే ఇది సాధ్యమైందని అన్నారు. ప్రధాని మోదీ ఆశీస్సులు, భాజపా నేతల బలం కూటమి ప్రభుత్వానికి మేలు చేకూర్చుతాయి. క్యాబినెట్ సహా అధికారులతో జరిగే సమావేశాల్లో చూస్తుంటా. వివిధ అంశాలపై చంద్రబాబు చాలా బలంగా మాట్లాడుతుంటారు. శాఖల మధ్య సమన్వయం ఎలా ఉండలనే దానిపై దిశానిర్దేశం చేస్తుంటారు. కొన్ని అభివృద్ధి పనులు చేసేటప్పుడు పంచాయతీరాజ్ శాఖ చాలా శాఖలతో సమన్వయం చేసుకోవాల్సి ఉంటుంది. కాకినాడలో ఓ ఐఎఫ్ఎస్ అధికారి మా పేరు చెప్పి డబ్బులు అడుగుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని.. అవసరమైతే సస్పెండ్ చేయాలని ఆదేశించాను. ఈ ప్రభుత్వంలో అలాంటి వ్యక్తుల ప్రమేయం ఉండొద్దని స్పష్టంగా చెప్పాను. లంచాల ప్రభుత్వం కాదిది.. నిలబడే ప్రభుత్వం అని పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు.గుడివాడ నియోజకవర్గంలో 43 గ్రామాల్లో నీటి సమస్యను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తన దృష్టికి తీసుకొచ్చారని పవన్ తెలిపారు. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు బూతులు, శాపనార్థాలు తప్ప ఈ నీటి సమస్య గురించి పట్టించుకోలేదని మండిపడ్డారు. వెంటనే గ్రామీణ నీటి సరఫరా అధికారులు ప్రతీ గ్రామానికి బృందాలను పంపి నీటి నాణ్యత పరిశీలించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. సంవత్సరానికి రూ.10 వేల కోట్లు ఉపాధి హామీ పథకం ద్వారా రాష్ట్రానికి నిధులు వస్తాయని, దీనిద్వారా నైపుణ్యం లేని వ్యక్తులకు ఉపాధి అందించే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పని చేయడానికి సిద్ధంగా ఉన్నవారికి 15 రోజుల్లో పని కల్పించడం ప్రభుత్వం బాధ్యత అన్నారు.

# బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం

**- తిరుమలలో ముందస్తు జాగ్రత్తలపై అధికారుల సమీక్ష - విఐపి సిఫారసు లేఖలు ఆమోదించరాదని నిర్ణయం**



**తిరుమల,అక్టోబర్14:** బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో రానున్న మూడు రోజులు రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. స్వామి దర్శనానికి చేరుకున్న భక్తులకు త్వరగా దర్శనం కల్పించేందుకు నిర్ణయించింది. ఈ క్రమంలో విఐపి సిఫార్సు లేఖలను ఆమోదించరాదని ఉన్నతస్థాయి సమావేశంలో నిర్ణయించారు. అలాగే విపత్తు నిర్వహణ ప్రణాళికపై తితిదే అడిషనల్ ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరితో కలిసి ఈవో శ్యామలరావు వర్చువల్ విధానంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. రాగల 36 గంటల్లో భారీ వర్ష సూచనపై సమావేశంలో చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో తితిదే జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, సీఈ సత్యనారాయణ, ఇతర విభాగాధిపతులు, జిల్లా పోలీసు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా శ్రీవారి ఆలయంలో 16న వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. 15న సిఫార్సు లేఖలు అనుమతించకూడదని, అలాగే భక్తుల భద్రత దృష్ట్యా బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు ఈవో ప్రకటించారు. అధికారులందరూ విపత్తును ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని ఈవో సూచించారు. 2021లో భారీ కొండ చరియలు విరిగి పడిన ఘటనతో తితిదే 700 పేజీల విపత్తు నిర్వహణ ప్రణాళిక రూపొందించిం దన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఈ ప్రణాళిక మరింత మెరుగు పరచాల్సిన అవసరం ఉందని అధికారులకు చెప్పారు. ఈవో స్థాయిలో విపత్తుల నివారణ ఎగ్జిక్యూటివ్ కమిటీ, అడిషనల్ ఈవో ఆధ్వర్యంలో విపత్తు నిర్వహణ సమన్వయ కమిటీ ఉందన్నారు. అగ్నిమాపక శాఖ, ఆరోగ్య శాఖ, విజిలెన్స్ విభాగం, ఇతర కీలకమైన శాఖల విభాగాధిపతులు తమ సిబ్బందితో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ రెస్పాన్స్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఘాట్ రోడ్లపై ట్రాఫిక్ జామ్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి. విద్యుత్ అంతరాయం ఏర్పడితే జనరేటర్లు నడపడానికి ముందస్తు జాగ్రత్తగా తగినంత డీజిల్ అందుబాటులో ఉంచుకోవాలి. ఐటీ విభాగం వారు భక్తులకు వసతి, దర్శనం, ప్రసాదాల తయారీ కార్యాకలాపాలకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి. విపత్కర పరిస్థితులను ఎదుర్కొనే చర్యల్లో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ అంబులెన్సులను అందుబాటులో పెట్టుకుని అప్రమత్తంగా ఉండాలి. ఇంజనీరింగ్ విభాగం వారు డ్యామ్ గేట్లను పర్యవేక్షించాలి. ట్రాఫిక్ పోలీసులు ఇంజినీరింగ్ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలి. ఏదైనా విపత్కర పరిస్థితి ఎదురైతే వేగంగా స్పందించేందుకు అగ్ని మాపక సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేసుకోవాలి. ప్రజా సంబంధాల విభాగం వాతావరణ సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఎస్వీబీసీ, మీడియా, తితిదే సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తూ భక్తులను అప్రమత్తం చేయాలని అధికారులను ఈవో ఆదేశించారు.

# తెలంగాణ ప్రయోజనాలు తాకట్టు

**- మూసీ ఉనికినే దెబ్బతీసేలా రాడార్ సెంటర్ - ఇక మూసీ సుందరీకరణలో అర్థం లేదు**

**- వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ ఏర్పాటుపై కెటిఆర్ ఆగ్రహం**

**తొలి సమయం, హైదరాబాద్,అక్టోబర్14:** వికారాబాద్ జిల్లా దామగుండంలో వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం సన్నాహాలు చేయడంపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ మండిపడ్డారు. బిఆర్ఎస్ హయాంలో దీనిని రాకుండా చూశామని అన్నారు. వికారాబాద్ జిల్లా దామగుండం అటవీ ప్రాంతంలో నేవీకి సంబంధించిన వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ నిర్మాణం ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు కేటీఆర్ తెలిపారు. ఓ వైపు మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్ పేరుతో లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేస్తామని చెబుతూనే మరోవైపు మూసీ నదిని పూర్తిగా ప్రమాదంలో పడేసే రాడార్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలపడమేమిటని కేటీఆర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇదెక్కడి ద్వంద్వ వైఖరంటూ రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఏం ప్రయోజనాలు ఆశించి తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నెల 15వ తేదీన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తుండటాన్ని బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేకిస్తుందన్నారు. రామగుండంలో రాడార్ ఏర్పాటు కారణంగా పర్యావరణానికి తీవ్రంగా నష్టం వాటిల్లుతుందని కేటీఆర్ చెప్పారు. దాదాపు 2900 ఎకరాల అటవీ భూభాగంతో పాటు 12 లక్షల చెట్లను నరికివేసి ఈ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టనున్నారన్నారు. జనవాసాలే లేని చోట ఏర్పాటు చేయాల్సిన రాడార్ కేంద్రాన్ని ఎందుకు తెలంగాణలో నిర్మిస్తున్నారో చెప్పాలన్నారు. మాట్లాడితే మూసీ పరిరక్షణ అని చెబుతున్న ముఖ్యమంత్రి మూసీనే ప్రమాదంలో పెట్టే ఈ ప్రాజెక్ట్‌కు ఎందుకు అంగీకారం తెలిపారో చెప్పాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న పదేళ్ల సమయంలో ఎంత ఒత్తిడి తెచ్చినప్పటికీ తమ ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌కు అంగీకారం తెలపలేదని కేటీఆర్ గుర్తు చేశారు. దేశంలోనే అటవీ సామర్థ్యాన్ని పెంచేందుకు హరితహారం చేపట్టి అటవీ విస్తీర్ణాన్ని బీఆర్ఎస్ సర్కార్ పెంచిందన్నారు. అలాంటిది రేవంత్ రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చిన వెంటనే దాదాపు 2900 ఎకరాల అటవీ భూభాగాన్ని నాశనం చేసేలా చర్యలు చేపట్టడమేమిటని కేటీఆర్ ప్రశ్నించారు.

ఓగానది జన్మస్థానం గంగోత్రి వద్ద 150 కిలోమీటర్ల పరిధిని కేంద్రం ఎకో సెన్సిటివ్ జోన్‌గా ప్రకటించిన విషయాన్ని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. గంగోత్రికి ఒక న్యాయం, మా మూసీ నదికి మరో న్యాయమా అంటూ నిలదీశారు. దామగుండంలో ఏర్పాటు చేస్తున్న రాడార్ కేంద్రం వికారాబాద్ అడవుల్లోనే మూసీ జన్మస్థానంలోనే ఉందన్నారు. నది పుట్టిన ప్రాంతాన్ని 'ఎకో సెన్సిటివ్ జోన్'గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నేవీ రాడార్ ఏర్పాటుతో మూసీ నది అంతర్ధానం అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. 'సోర్స్ అఫ్ ద రివర్'పై ఇది గొడ్డలి పెట్టని చెప్పారు. మూసీ నది పురుడు పోసుకున్న చోట 12 లక్షల చెట్ల నరికివేతతో కోలుకోలేని అనర్థం జరుగుతుందన్నారు. పర్యావరణ సమతుల్యతకు పెను ప్రమాదాన్ని సృష్టించే ఈ ప్రాజెక్ట్‌ను విరమించుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రాడార్ కేంద్రానికి వ్యతిరేకంగా పర్యావరణ వేత్తలతో కలిసి బీఆర్ఎస్ పోరాటం.. ÷ఊసీ నదిని ఫణంగా పెట్టేందుకు సహకరిస్తూ మరో వైపు మూసీ పరిరక్షణ అంటూ ముఖ్యమంత్రి డ్రామాలు చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. మూసీ పరిరక్షణపై ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రాడార్ నిర్మాణానికి ఎట్టి పరిస్థితుల్లో అంగీకారం తెలిపేది కాదన్నారు. మూసీ పేరుతో వేల కోట్ల దోపిడీ చేయాలన్న ఆలోచనే తప్ప నిజంగా నది పరిరక్షణపై ఈ ప్రభుత్వానికి ఎలాంటి చిత్తశుద్ధి లేదన్నారు. దేశ రక్షణ విషయంలో తెలంగాణ ముందుంటుంది కానీ జనావాసాలు లేని చోట ఏర్పాటు చేయాల్సిన రాడార్ కేంద్రాన్ని ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసి నష్టం చేస్తామంటే అంగీకరించమని చెప్పారు. రాడార్ కేంద్రానికి వ్యతిరేకంగా పర్యావరణ వేత్తలతో కలిసి బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# వాగులు, చెరువులపై దృష్టి పెట్టాలి

**వరద నీటి నిర్వహణ వ్యవస్థను పటిష్ఠం చేయాలి**

**వర్షాల నేపథ్యంలో సిఎం చంద్రబాబు సమీక్ష**

**ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్న మంత్రి నిమ్మల**

**అమరావతి,అక్టోబర్14:** ఆకస్మికంగా వచ్చే వరదల కారణంగా రైల్వే లైన్‌లు, సమీపంలోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని.. వాగులు, చెరువులపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్ష సూచన నేపథ్యంలో నీటిపారుదల శాఖపై మంత్రి రామానాయుడితో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో సమీక్ష నిర్వహించారు. తుంగభద్ర, శ్రీశైలం, సోమశిల తదితర ప్రాజెక్టులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. నెల్లూరు, ప్రకాశం, సత్య సాయి, అనంతపురం, చిత్తూరు సహా వివిధ జిల్లాల్లో వాగులు, కాలువల క్యాచ్‌మెంట్ ఏరియాల్లో వరద నీటిని అంచనా వేసి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వరద నీటి నిర్వహణ వ్యవస్థను పటిష్ఠం చేయాలన్నారు.సమీక్ష అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి రామానాయుడు మాట్లాడారు. భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై జిల్లా కలెక్టర్లను అప్రమత్తం చేశాం. ఇంకా కొన్ని జిల్లాల్లో రిజర్వాయర్లు నింపాల్సి ఉంది. గత ఐదేళ్లలో చాలా ప్రాజెక్టులను సరిగా నిర్వహించలేకపోయారు. కనీసం రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షలు కూడా జగన్ ప్రభుత్వం కేటాయించలేకపోయింది. నవంబర్ నెల నుంచి ప్రాధాన్యతా క్రమంలో ప్రాజెక్టుల మరమ్మతులు, ఇతర పనులు చేపడతాం. పోలవరం పనులపై వర్క్ క్యాలెండర్ రూపొందిస్తున్నాం. డయాఫ్రం వాల్ పనులు కూడా నవంబర్ నెల నుంచే ప్రారంభం అవుతాయి. ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యాం కూడా వీలైనంత త్వరగా పూర్తి చేయాలనే ఆలోచనలో ఉన్నామని మంత్రి స్పష్టం చేశారు. భారీ వర్ష సూచనతో ప్రభుత్వం అలెర్ట్ అయిందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. భారీ వర్షాల వల్ల ఇబ్బందులు రాకుండా ఉండేలా చూడాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని వెల్లడించారు. ప్రాజెక్టుల్లో ఇన్ ఫ్లోస్ మీద ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామన్నారు. సోమశిల రిజర్వాయరుకు గతంలో ఎన్నడు రానంత వరద ఈ సారి వస్తోందన్నారు. ముందుగానే చెరువులు, వాగులు, రిజర్వాయర్లు గండ్లు పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని మంత్రి చెప్పారు. ఇటీవల కాలంలో అకస్మాత్తుగా వరదలు వస్తున్నాయని పేర్కొన్నారు. వరదలు వచ్చినా ఇబ్బంది రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని మంత్రి స్పష్టం చేశారు.

ప్రకాశం, చిత్తూరు, అనంతపురం, సత్యసాయి, కర్నూలు, కడప వంటి జిల్లాల్లో వాగుల్లో ప్రవాహాలను పరిశీలిస్తున్నామన్నారు. వాగుల పరివాహక ప్రాంతాల్లో ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వచ్చే 24 గంటల్లో భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ అంచనా వేసిందన్నారు. ఆర్టీజీఎస్ సహకారంతో నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నామని మంత్రి చెప్పారు. ఇంకా కొన్ని జలశయాల్లో నీరు నింపలేని పరిస్థితి నెలకొందని.. గత ఐదేళ్ల పాపం రాష్ట్రాన్ని పీడిస్తోందని విమర్శించారు. పెన్నా బేసిన్లోని రిజర్వాయర్లల్లో నీటిని నింపలేక పోతున్నామన్నారు. గత ఐదేళ్లల్లో ఇరిగేషన్ వ్యవస్థను నాశనం చేశారని.. ప్రతికూల పరిస్థితుల్లో కూడా రిజర్వాయర్లల్లో నీటిని నింపే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఏపీలోని రిజర్వాయర్లల్లో మొత్తంగా 760 టీఎంసీల కెపాసిటీతో నీటిని నిల్వ చేయొచ్చని వెల్లడించారు. ప్రస్తుతం 680 టీఎంసీల నీటిని నిల్వ చేయగలిగామన్నారు. ఏపీని కరవు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామన్నారు. వరదలు, వర్షపు నీటిని ఒడిసి పట్టేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. గుండ్లకమ్మ ప్రాజెక్టును పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి వ్యాఖ్యానించారు. నవంబర్ నెల నుంచి ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టుల వారీగా మరమ్మతులు చేపడతామన్నారు. నవంబర్ నెల నుంచే పోలవరం ప్రాజెక్టు పనులు పునః ప్రారంభించ నున్నామని మంత్రి వెల్లడించారు. పోలవరం పనులపై వర్క్ క్యాలెండర్ రూపొందిస్తున్నామని తెలిపారు. డయాఫ్రం వాల్ పనులు కూడా నవంబర్ నెల నుంచే ప్రారంభం అవుతాయన్నారు. ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యాం కూడా వీలైనంత త్వరగా పూర్తి చేయాలనే ఆలోచన ఉందన్నారు. ఈ నెలాఖరులోగా కాపర్ డ్యాంల మధ్యలో నిల్వ ఉన్న నీటిని తోడేసే ప్రయత్నం చేస్తున్నామన్నారు. జగన్ అనే భూతాన్ని సీసాలో పెట్టి బిరడా పెట్టామని.. ఆ సీసాకున్న బిరడా తిరిగి రాకుండా చూస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.

# గత ప్రభుత్వం గుడిని మింగితే..

**- ఈ ప్రభుత్వం లింగాన్ని మింగేస్తున్నది - సిండికేట్లుకే మద్యం షాపులకు టెండర్**

**- 3 వేలకు పైగా మెజారిటీ షాపులు దక్కడంపై అనుమానం - పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల ఘాటు విమర్శలు**

**విజయవాడ,అక్టోబర్14:** గత ప్రభుత్వం గుడిని మింగితే..ఈ ప్రభుత్వం గుళ్లో లింగాన్ని కూడా మింగేస్తున్నదని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడిపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ పనుల్లో రాజకీయ జోక్యం వద్దని చెప్పిన చంద్రబాబు.. మద్యం సిండికేట్లను అరికట్టడంలో రాజకీయ చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. ఎక్కడికక్కడే అధికార పార్టీ నాయకులు కుమ్మక్కై సిండికేట్లుగా ఏర్పడి మద్యం షాపులను దక్కించుకున్నారని తెలిసిందని తెలిపారు.కూటమి సిండికేట్లకే 3 వేలకు పైగా మెజారిటీ షాపులు దక్కాయంటే మీ పారదర్శకత, నిష్పాక్షికత ఎంత గొప్పగా ఉందో అర్థం అవుతుందని చంద్రబాబును ఉద్దేశించి షర్మిల అన్నారు. మీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల కనుసన్నల్లోనే టెండర్ల ప్రక్రియ సాగిందని అన్నారు. సాధారణ ప్రజలకు షాపులు దక్కకుండా రాష్ట్ర వ్యాప్తంగా బెదిరింపులకు పాల్పడ్డారని.. ప్రాణాలు పోతాయని హెచ్చరికలు చేశారని ఆరోపించారు.

కూటమి నేతలకు కాదని పొరపాటున ఎవరికైనా లాటరీ చిక్కితే, లైసెన్స్ ఇస్తారా లేక 30 శాతం కమిషన్ ఇస్తారా ? లేకుంటే చస్తారా ? అంటూ బెదిరించారని అన్నారు.

## ముక్కు పిండి ఛార్జీలు వసూలు చేయడం దుర్మార్గం

**భారీగా పెరిగిన ఆర్టీసీ టికెట్ ధరలపై హరీష్ రావు సీరియస్**

**తొలి సమయం,హైదరాబాద్,అక్టోబర్14:** తెలంగాణ రాష్ట్రంలో భారీగా ఆర్టీసీ టికెట్ ధరలు పెరిగాయి. దీనిపై హరీష్ రావు సీరియస్ అయ్యారు. ఆర్టీసి టికెట్ ధరలు విపరీతంగా పెంచి బతుకమ్మ, దసరా పండుగ సమయంలో సొంతూళ్ళకు వెళ్లిన ప్రయాణికుల నుండి ముక్కు పిండి ఛార్జీలు వసూలు చేయడం దుర్మార్గం అంటూ ఆగ్రహించారు మాజీ మంత్రి హరీష్ రావు. టికెట్ ధర రూ. 140తో జేబీఎస్ నుండి సిద్దిపేటకు వెళ్లిన ప్రయాణికుడు తిరుగు ప్రయాణంలో టికెట్ ధర రూ.200చెల్లించాల్సిన పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. హన్మకొండ నుండి హైదరాబాద్ సూపర్ లగ్జరీ బస్సు ప్రయాణం సాధారణ రోజుల్లో రూ. 300 ఉంటే, పండుగ వేళ ప్రభుత్వం పెంచిన చార్జీ రూ.420 అని మండిపడ్డారు. బస్సుల సంఖ్య పెంచకుండా, టెకెట్ ఛార్జీలు పెంచి తెలంగాణ ప్రజలకు పండుగ సంతోషాన్ని లేకుండా చేయడమే నా ప్రజా పాలన ముఖ్యమంత్రి గారు..? అంటూ ఆగ్రహించారు మాజీ మంత్రి హరీష్ రావు. హన్మకొండ నుండి హైదరాబాద్ సూపర్ లగ్జరీ బస్సు ప్రయాణం సాధారణ రోజుల్లో రూ. 300 ఉంటే, పండుగ వేళ ప్రభుత్వం పెంచిన చార్జీ రూ.420 అని మండిపడ్డారు. బస్సుల సంఖ్య పెంచకుండా, టెకెట్ ఛార్జీలు పెంచి తెలంగాణ ప్రజలకు పండుగ సంతోషాన్ని లేకుండా చేయడమే నా ప్రజా పాలన ముఖ్యమంత్రి గారు..? అంటూ ఆగ్రహించారు మాజీ మంత్రి హరీష్ రావు.

## దుర్గామాత ఊరేగింపులో కాల్పులు..

**ఒకరు మృతి, షాపులు, వాహనాలు దగ్ధం!**

**ఉత్తర్ ప్రదేశ్ భైరాచ్ జిల్లాలో ఘటన**

**భైరాచ్,అక్టోబర్14:** దసరా పండుగ సందర్భంగా దుర్గామాత ఊరేగింపులో హింస చెలరేగింది. ఈ హింసలో తుపాకీ కాల్పులు జరిగి ఒక వ్యక్తి మరణించగా.. నిందితులు వాహనాలు, షాపులకు నిప్పంటించారు. ఈ ఘటన ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలలోని భైరాచ్ జిల్లాలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. భైరాచ్ జిల్లాలోని మహసీ మండలంలో ఆదివారం దసరా పండుగ ముగింపు వేడుకల్లో భాగంగా కొందరు దుర్గామాత ఊరేగింపు చేశారు. అయితే ఊరేగింపులో జోరుగా డీజె సంగీతం పెట్టారు. అలా ఊరేగింపు తీసుకెళ్లే మార్గంలో ముస్లిం జనాభా ఉన్న ప్రాంతం వచ్చింది. ఆ ప్రాంతానికి చేరుకోగానే ముస్లిం వర్గానికి చెందిన కొందరు ఊరేగింపు డీజె మ్యూజిక్ తగ్గించాలని చెప్పారు. అలా చేయడం కుదరదని ఊరేగింపు వర్గం చెప్పడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ వాగ్వాదంతో ఇరు వర్గాల మధ్య గొడవ పెరిగి దాడులు జరిగాయి. ఇంతలో వెనుక నుంచి ఎవరో తుపాకీతో కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఒక బుల్లెట్ తగిలి రామ్ గోపాల్ మిశ్రా అనే 22 ఏళ్ల ఒక వ్యక్తి మరణించగా.. కొందరికి గాయాలయ్యాయి. దీంతో గొడవలో హింస చెలరేగింది. ఇరు వర్గాలు రాళ్లు రువ్వుకున్నారు. గుర్తు తెలియని కొందరు పరిసరాల్లోని బైకులు, ఇళ్లు, షాపులకు నిప్పంటించారు.బుల్లెట్ గాయంతో పడిపోయిన రామ్ గోపాల్ మిశ్రాని ఆస్పత్రికి తరలించగా.. డాక్టర్లు అతను చనిపోయాడని ధృవీకరించారు. దీంతో అతని కుటుంబం, మిత్రులు ఆస్పత్రి బయట నిరసన చేశారు. నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ.. అప్పటి వరకు మృతదేహాన్ని తీసుకెళ్లేది లేదని ఆస్పత్రి బయటే నిరసన చేశారు. ఈ ఘటన గురించి తెలిసి జిల్లాలోని దుర్గామాత ఊరేగింపు చేసేవారందరూ నిందితులను కఠినంగా శిక్షించేంత వరకు విగ్రహాలు నిమజ్జనం చేసేది లేదని నిరసనకు దిగారు. ఈ ఘటన గురించి సమాచారం తెలుసుకున్న ముఖ్యమంత్రి యోగి ఆదిత్య నాథ్ పోలీస్ శాఖపై మండిపడ్డారు. దుర్గా మాత ఊరేగింపులో భద్రతగా ఉన్న పోలీసులు ఏం చేస్తున్నారని అడిగారు. నిర్లక్ష్యం వహించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేశారు.

## తమిళనాడులో భారీ వర్షాలు

**ఈనెల 18నుంచి ఉద్యోగులకు వర్క్ ఫ్రం హెూం**

**చెన్నై,అక్టోబర్14:** ఈ నెల 18వ తేదీ నుంచి ప్రైవేట్, ఐటీ ఉద్యోగులకు వర్క్ ఫ్రం హెూమ్ ఇవ్వనున్నట్లు తమిళనాడు ప్రభుత్వం ప్రకటించింది. భారీ వర్షాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. తమిళనాడు వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో ఇప్పటికే చెన్నై సహా 5 జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ అయింది. ఈ క్రమంలోనే వర్షాలపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్.. అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. జిల్లాల్లో వర్షాలు, సహాయక చర్యలపై అధికారులను ఆరా తీశారు. ముఖ్యంగా రాజధాని చెన్నైలో ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టులో విద్యాసంస్థలకు మంగళవారం నాడు సెలవు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. అలాగే రేపటి నుంచి 18వ తేదీ వరకు ప్రైవేట్, ఐటీ ఉద్యోగులకు వర్క్ ఫ్రం హెూమ్ ఇవ్వాలని ఆయా సంస్థల యాజమాన్యాలకు అల్టిమేటం జారీ చేశారు.

## పొన్నవోలుకు హైకోర్టులో చుక్కెదురు

**అమరావతి,అక్టోబరు 14:** మాజీ అడిషనల్ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డికి ఏపీ హైకోర్టులో చుక్కెదురైంది. తనకు భద్రత కల్పించాలని పొన్నవోలు వేసిన పిటిషన్ను హైకోర్టు కొట్టివేసింది. తనకు ప్రాణభయం ఉందని.. భద్రత కల్పించాలని ఆయన పిటిషన్ వేశారు. సుదీర్ఘ వాదనల తర్వాత తీర్పును కోర్టు రిజర్వ్ చేసింది. సుధాకర్ రెడ్డికి భద్రత కల్పించాల్సిన అవసరం లేదని అభిప్రాయపడింది. దీంతో పొన్నవోలు పిటిషన్ను డిస్మిస్ చేసింది.

## ఏపీలో ముగిసిన మద్యం లాటరీ ప్రక్రియ

**అమరావతి,అక్టోబరు 14:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన కొత్త మద్యం పాలసీ కి అనుగుణంగా నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 3,396 మద్యం దుకాణాలకు రాష్ట్రవ్యాప్తంగా 89,882 దరఖాస్తులు వచ్చాయి. కాగా ఈ దరకాస్తులకు సంబంధించిన లాటరీ విధానాన్ని సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం అయింది. కాగా పూర్తి బందోబస్తు నడుమ నిర్వహించిన ఈ లాటరీ కొన్ని ప్రాంతాల్లో జాతరను తలపించింది. ఉదయం నుంచి నిరాటంకంగా జరిగి లాటరీ విధానం మధ్యాహ్నం 3 గంటల వరకు పూర్తి అయింది. కాగా డ్రాలో మద్యం షాప్ లైసెన్స్ (దుకాణం) దక్కించుకున్న వ్యాపారులు.. 24 గంటల్లో లైసెన్స్ ఫీజు చెల్లించాలనే నిబంధన విధించారు. దీంతో డ్రాలో షాపులు వచ్చిన వారు ప్రస్తుతం నగదు సమీకరణ పనిలో పడ్డారు. గత ప్రభుత్వం పాత మద్యం పాలసీని రద్దు చేసి కొత్త పాలసీ నీ తీసుకొచ్చింది. కాగా ఈ రోజు లక్కీ డ్రాలో షాప్ లు వచ్చిన వారు. 16 నుంచి కొత్త షాప్ లో అమ్మకాలు జరుపుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉంటే ఈ కొత్త మద్యం పాలసీ కారణంగా ప్రభుత్వానికి.. నాన్ రిఫండబుల్ రుసుముల రూపంలో రూ.1,797.64 కోట్ల మేర ఆదాయం సమకూరింది.

## ఏపీకి కేంద్రం మరో భారీ శుభవార్త

**గ్రామీణ ప్రాంత అభివృద్ధికి కేంద్రం భారీ నిధుల విడుదల**

**అమరావతి,అక్టోబరు 14:** ఏపీకి కేంద్రం మరో భారీ శుభవార్త చెప్పింది. సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన రిజల్ట్ కేంద్రం కేటాయింపుల్లో కనిపిస్తోంది. తాజాగా రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంత అభివృద్ధి కోసం కేంద్రం భారీ నిధులను విడుదల చేసింది. మొత్తం రూ. 988.773 కోట్లు రాష్ట్రంలోని పంచాయతీలకు అందించాయి. ఈ నిధులు 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ద్వారా విడుదల చేయబడ్డాయి. అన్‌టైడ్ గ్రాంట్ కింద రూ. 395.5091 కోట్లు, టైడ్ గ్రాంట్ కింద రూ. 593.2639 కోట్ల నిధులకు కేంద్రం ఏపీకి కేటాయించింది. ఈ నిధులు రాష్ట్రంలోని 9 జెడ్పీలు, 615 మండల పంచాయతీలు, 12,853 గ్రామ పంచాయతీలకు వర్తిస్తాయి. అన్‌టైడ్ గ్రాంట్ వినియోగం: ఈ నిధులను స్థానిక అవసరాల కోసం వినియోగించుకోవచ్చు. కానీ జీతాలు లేదా పరిపాలన ఖర్చుల కోసం వినియోగించరాదు. వ్యవసాయం, గ్రామీణ గృహనిర్మాణం, పారిశుద్ధ్యం, విద్య వంటి అంశాల కోసం ఈ నిధులను వాడుకోవచ్చు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST:MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101